

అల్మాస్కాన్‌పేట్‌లో భూముల సర్వే

కులకచర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్మాస్కాన్‌పేట్‌లో శనివారం రెవెన్యూ అధికారులు భూములను సర్వే చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాలతో ఐదు రోజులుగా 50మంది రైతుల 350 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు తెలిపారు. 1 నుంచి 86 సర్వే నెంబర్లలో 113 మంది రైతులు 1,056 ఎకరాల్లో కాస్తులో ఉన్నారు. రైతులందరీ భూములను సర్వే చేస్తామని అధికారులు తెలిపారు.



జాతరకు వస్తున్న భక్తులు

ఏసయ్య స్మరణలో..

ధారూరు మెథడిస్టు జాతరకు తరలివస్తున్న క్రైస్తవులు

కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం

నేడు ముగియనున్న ఉత్సవాలు

ధారూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): : ధారూరు మెథడిస్టుజాతర ప్రాంగణం శనివారం క్రైస్తవ భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కాలినడకన, వాహనాలలో, బస్సులు, రైళ్లల్లో పెద్ద ఎత్తున జాతర ప్రాంతానికి చేరుకోవటంతో కిక్కిరిసిపోయింది. సాయంత్రం స్టేషన్ ధారూరు రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక రైలు దిగిన భక్తులు జాతర ప్రాంగణానికి చేరుకున్నారు. దైవ సందేశాలు, పాటలు, కీర్తనలు, ఏసునామ స్మరణతో ప్రాంగణం మార్మోగింది. ప్రధాన వేదిక, ముఖ ద్వారం సమీపంలోని ఏసు ప్రభువు శిలువల వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనారోగ్యంతో ఉన్న వారికి, చిన్నారులకు పాస్టర్లు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరకు వచ్చిన భక్తులు గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటలు వండుకుని, అక్కడే భోజనాలు చేసి బస చేశారు. కాగా మంగళవారం నుంచి కొనసాగుతున్న జాతర ఉత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. చివరి రోజు పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు జాతరలో పాల్గొని ఏసు ప్రభువు శిలువల వద్ద ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథులుగా బిషప్‌లు, లే లీడర్లు, జాతర కమిటీ నిర్వాహకులు పాల్గొని భక్తులకు దైవ సందేశం వినిపించి ఆశీర్వాచనాలు అందజేస్తారు. మొక్కులు తీరని భక్తులు హుండీలలో నగదు,బంగారం,వెండితో పాటు మేకలు, గొర్రెలు, కోళ్లను కానుకలుగా సమర్పిస్తారు. ప్రార్థనల అనంతరం భక్తులు తమ స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవనున్నారు.



ప్రాంగణంలోని శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నవాబ్‌పేట మండలంలో ప్రవహిస్తున్న మూసీ నది(ఫైల్)



నగరానికే తలమానికం

Sunday Special

నాటి ముచుకుందానే.. నేటి మూసీ నది

హైదరాబాద్ చరిత్రలో మూసీ నదికి ప్రత్యేక స్థానం ఉంది. ఒకప్పుడు నగరం పేరు చెప్పగానే మంత్రముగ్ధులను చేసే మూసీ నది కళ్ల ముందు కదలాడేది. కానీ ప్రస్తుతం మూసీ అంటే.. మురికి కూపం అంటూ చాలా మంది ముక్కు మూసుకుంటారు. అయితే ఈ నదికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. అనంతగిరి కొండల్లో జన్మించిన ముచుకుందా నదియే మూసీ నది. హైదరాబాద్ నగరానికి తలమానికంగా మారిన మూసీ నది కాలక్రమేణా తన ప్రాశస్త్యాన్ని కోల్పోయింది.



అనంతగిరికొండల్లో మూసీ నది ప్రారంభం ఇక్కడి నుంచే..

- అనంతగిరిలో జన్మించి.. వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసి..
- గతంలో నగరవాసుల దాహార్తి తీర్చిన మూసీ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వరకే నదీ స్వచ్ఛత
- రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 240 కి.మీ. మేర ప్రవాహం
- పూర్వవైభవం దిశగా ప్రభుత్వం కార్యాచరణ

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూసీ నది 125 ఏళ్ల కిందట అన్ని నదుల మాదిరిగానే స్వచ్ఛతతో ఉండేది. ఘన చరిత్ర ఉన్న మూసీ కాలక్రమేణ కాలుష్య సాగరంగా మారింది. కాలుష్యం, ఆక్రమణలతో సుందరమైన మూసీ ఘనత మసక బారింది. నది ప్రక్షాళనపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఘాటుగా స్పందించడంతో నది పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరంగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. నది అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. లండన్ నగరం మీదుగా ప్రవహించే థేమ్స్ నది మాదిరిగా ఈ మూసీ నదికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిన విషయం తెలిసిందే.

ఒకప్పుడు నగర దాహార్తిని తీర్చేలా

ముచుకుందా నది కాలక్రమేణా మూసీ నది పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చింది. అనంతగిరి కొండల్లో పుట్టిన ఈ నది బుగ్గ మీదుగా, ధన్నారం, కొత్తగడి, పెండ్లిమడుగు, మూలమడ, చించల్‌పేట, అత్తాపూర్, అక్నాపూర్,

- మిగతా 7వ పేజీలో...

న్యూస్ బాక్స్

19న చతుర్విధ జల ప్రక్రియపై రౌండ్ టేబుల్



మర్రి శశిధర్ రెడ్డి

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలో సాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు మూసీనది పునరుజ్జీవనంలో భాగంగా హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియ అమలును చేపట్టాలని ప్రతిపాదించనున్నట్లు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న వికారాబాద్ అనంత పద్మనాభ స్వామి కళాశాలలో మధ్యాహ్నం 1.30 గంటలకు రౌండ్‌టేబల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం జరగనున్న సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు. వికారాబాద్‌లో దాదాపు 5,09,380 ఎకరాల సాగు భూమి ఉండగా కేవలం 13.6శాతం అంటే 69,325 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతుందన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్(ఈసీఐఎల్)లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్(డీఎంఎస్‌ఓటీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్(డీఈసీజీ) కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరమన్నారు. కోర్సుల కాల వ్యవధి రెండేళ్లుకాగా, ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21 సాయంత్రం 5 లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. వివరాల ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

గొల్ల చెరువుకు మహర్దశ ఎప్పుడో?

- మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకునేదెన్నడు?
- సుందరీకరణ పనుల కోసం ప్రజల ఎదురుచూపు
- పూర్తి చేయాలని సర్కారుకు వేడుకోలు



7

ఐటీ పార్కు ఏర్పాటయ్యేనా?

- 11 ఏళ్లుగా భూ సేకరణ
- రైతులకు పరిహారం చెల్లించి రెండేళ్లు పూర్తి
- అభివృద్ధికి నోచని మాదారం ఐటీ పార్కు



8

మేడ్చల్ జిల్లాలో రెండు కొత్త సొసైటీలు

- ఎదులాబాద్, మూడు చింతలపల్లిల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెల్లడి



7



రాజబొల్లారంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



తాండూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

నిఘా నీడలో గ్రూప్-3 పరీక్ష

- నేటి నుంచి రెండు రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జామ్స్
- మేడ్చల్ జిల్లాలో 115 పరీక్షా కేంద్రాలు.. 65,361 మంది అభ్యర్థులు
- వికారాబాద్ జిల్లాలో 31 కేంద్రాలు.. 10,196 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సర్వం సిద్ధం

వికారాబాద్/తాండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్-3 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రూప్-3 పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల నిఘా నీడలో గ్రూప్-3 పరీక్ష జరగనుంది. చీఫ్ సూపరింటెండెంట్ గదుల్లో 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రూప్-3 పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, టీజీపీఎస్సీ ప్రత్యేక పరిశీలకులతో కలిసి పలుమార్లు సమీక్షించారు. ఈనెల 17, 18వ తేదీల్లో జరగనున్న ఈ పరీక్ష నిర్వహణలో అనుసరించాల్సిన నియమ నిబంధనల గురించి సిబ్బంది సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రూప్-3 పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 10,196 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం వికారాబాద్‌లో 14, తాండూరులో 11, పరిగిలో 5, పూడూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. వికారాబాద్, పరిగి, పూడూరు పరిధిలోని 20 కేంద్రాల్లో 6,981 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, తాండూరు పరిధిలోని 11 కేంద్రాల్లో 3215 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. సూచించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని టీజీపీఎస్సీ అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, పరీక్షకు హాజరయ్యే దివ్యాంగుల కోసం 28 మంది స్క్రైబ్ అభ్యర్థులను అనుమతించనున్నారు. వికారాబాద్‌లోని సిద్ధార్థ జూనియర్ కళాశాల, పూడూరు మండలం, ఎన్కేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్షకు హాజరు కానున్న దివ్యాంగ అభ్యర్థులకు వారు స్క్రైబ్‌లుగా వ్యవహరించనున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను 6 రూట్లుగా విభజించారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి ఉంటారు. 31 మంది టీజీపీఎస్సీ పరిశీలకులు, 11 మంది ఫ్లయింట్ స్క్వాడ్ అధికారులు, 12 జాయింట్ రూట్ అధికారులు, 112 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 500 మంది వరకు ఇన్విజిలేటర్లు పరీక్ష నిర్వహణలో

- మిగతా 8వ పేజీలో..

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

ధారూరు మండలం హరిదాసుపల్లిలో ఘటన




మహిపాల్ రెడ్డి(ఫైల్)

ధారూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ధారూరు మండల పరిధిలోని హరిదాసుపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి(45)కి రెండెకరాల పొలం ఉంది. నాలుగేళ్లుగా వికారాబాద్ మండలం గొట్టిముక్కల గ్రామంలో మరో పది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకు సాగు చేస్తున్నాడు. సాగు పెట్టుబడికి ప్రైవేట్ వ్యక్తుల వద్ద దాదాపు రూ.14 లక్షల వరకు అప్పుడు చేశాడు. హరిదాసుపల్లి సొసైటీలో సాగు కోసం తాజాగా రూ. 1.20 లక్షల రుణం తీసుకున్నాడు. ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. అయితే అతివృష్టి, అనావృష్టితో పంటలు పండలేదు. ఈ సారి సాగు చేసిన పత్తి పంట అధిక వర్షాలకు దెబ్బతినటంతో దిగుబడి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన మహిపాల్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో మహిపాల్ రెడ్డి తమ్ముడు కమాల్‌రెడ్డి శనివారం తన పొలం వద్దకు వెళ్లాడు. దుర్వాసన రావడంతో పక్కన ఉన్న అన్న పొలం వైపు పరిశీలించగా మహిపాల్‌రెడ్డి చెట్టుకు ఉరేసుకుని విగత జీవిగా కన్పించాడు. వెంటనే మృతుడి కుమారుడు సంతోష్‌రెడ్డికి సమాచారమిచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. అప్పులు పెరగడంతో తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయి మహిపాల్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారుడు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

34.15%

మేడ్చల్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

- 1,29,706 కుటుంబాల వివరాల సేకరణ
- 6,184 ఇళ్లకు తాళాలు
- గడువులోగా పూర్తయ్యేనా!
- ఇంకా ఐదురోజులే సమయం



మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 34.15 శాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 6న ప్రారంభమైన ఇంటింటి సర్వేకు జిల్లాలో 2,756 మంది ఎన్యూమరేటర్లను, 274 మంది సూపర్‌వైజర్లను నియమించారు. పది రోజుల్లో జిల్లాలో 34.15 శాతం పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 3,79,766 గృహాలు ఉండగా అందులో 1,29,706 గృహాల్లో సర్వే పూర్తి చేయగా ఇంకా 2,50,060 గృహాల్లో సర్వే చేయాల్సి ఉంది. 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది. 65.85 శాతం గృహాల సర్వే ఐదు రోజుల్లో పూర్తి కాకపోగా మరో 15 రోజులు అదనంగా సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఒక్కో ఎన్యుమరేటరు 10 నుండి 15 గృహాల సర్వే పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అది సాధ్యం కావడం లేదు. సర్వే పట్టికలో ప్రశ్నలను పూర్తి చేయడానికి దాదాపు 40నుంచి 55 నిమిషాల సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు పేర్కొంటున్నారు.

సహకరించని ఇంటి యజమానులు

ఇదిలా ఉంటే చాలా గృహాల వద్ద యజమానులు సరైన సమాధానాలు తెలపకపోవడంతో ఇంకా ఆలస్యమౌతుందని వారు వాపోతున్నారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా సాగుతుందని ఉన్నతాధికారులు తెలుపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎన్యూమరేటర్లు ఇబ్బందులకు గురౌతున్నారు. సమయం ఎక్కువగా లేకపోవడంతో కొన్ని ప్రశ్నలకు ఎన్యుమరేటర్లే సమాధానాలు నింపివేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సర్వే అధికారులు వస్తున్న విషయం తెలుసుకుని ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో 6,184 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లుగా అధికారులు నమోదు చేశారు. నగర శివారు చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన వారు నివాసాలు ఉంటున్నారు. సర్వే సమయంలో వారు వారి సొంత ప్రాంతాలకు తరలిపోతుండటం కూడా అధికారులకు తలనొప్పిగా మారింది. సర్వే వివరాలు ఎక్కడ తెలిపినా ఇబ్బందులు ఉండవని అధికారులు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఇబ్బందులు ఎదురౌతాయనే అనుమానాలతో చాలా మంది వారి వారి గ్రామాల్లోనే వివరాలు తెలిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో పాటు ఇతర

లక్ష దీపోత్సవం

కార్తీక మాసోత్సవంలో భాగంగా శనివారం బషీరాబాద్ మండలంలోని మంతట్టి గ్రామంలో జగద్గురు రాచోటేశ్వర శివాచార్యులు ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాల మహిళలు హాజరై కార్తీక దీపాలు వెలింగించి మొక్కులు తీర్చుకున్నారు. - బషీరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)



మేడ్చల్ జిల్లాలో రెండు కొత్త సొసైటీలు

- ఎదులాబాద్, మూడుచింతలపల్లిల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి వెల్లడి

ఘట్‌కేసర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా రెండు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో మాజీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులతో చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎదులాబాద్, మూడు చింతలపల్లిల్లో సొసైటీలు ఏర్పాటవుతాయని అన్నారు. ఘట్‌కేసర్ సొసైటీ అభివృద్ధికి చైర్మన్ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఘట్‌కేసర్ సొసైటీ ఆవరణలో రైస్‌మిల్ ఏర్పాటు చేయాలని కొందరు ప్రతిపాదించడంపై మలిపెద్ది స్పందిస్తూ నివాసాల మధ్య రైస్‌మిల్ ఏర్పాటు సాధ్యం కాదని, కాబట్టి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇరత వ్యాపారాలపై దృష్టిసారించాలన్నారు. సొసైటీ కార్యాలయానికి 5నుంచి 8ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పించాలని నాయకులు మాజీ ఎమ్మెల్యేను కోరగా.. సొసైటీనే ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు భూమి కొంటే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు గొంగళ్ల స్వామి, డి.భిక్షపతిగౌడ్, మాజీ ఎంపీపీ బి.శ్రీనివాస్‌గౌడ్, ఎండీ రాహుల్‌రాజ్, నాయకులు బి.ప్రభాకర్‌రెడ్డి, స్టీవెన్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రెండో ఏఎన్ఎంల మహాసభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పి.పర్వతాలు

శంషాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో నేడు(ఆదివారం) నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్ఎంల మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామిలు పిలుపునిచ్చారు. శనివారం వారు శంషాబాద్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 7వేల మంది వరకు ఉన్న రెండో ఏఎన్ఎంలకు 18ఏళ్లుగా రెగ్యులరైజ్ కాలేదని, దీంతో వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సెకండ్ ఏఎన్ఎంల ప్రతినిధులు హాజరవుతారని, అలాగే ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు రామాంజనేయులు హాజవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఏటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దత్తు, జిల్లా కార్యదర్శులు కె.చంద్రయాదవ్, సత్యనారాయణ, రెండో ఏఎన్ఎంల రాష్ట్ర నాయకురాలు జె.పద్మ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

● ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏసీపీ రంగస్వామి అవగాహన



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), నూతన మోటారు వెహికిల్ యాక్ట్‌లను అతిక్రమిస్తే కఠిన శిక్షలు తప్పవని షాద్‌నగర్ ఏసీపీ ఎస్సీహెచ్.రంగస్వామి హెచ్చరించారు. షాద్‌నగర్‌లోని బుగ్గరెడ్డి గార్డెన్‌లో శనివారం డ్రైవర్లకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. వారితో ఆయన మాట్లాడుతూ.. వాహనాల అన్ని సర్టిఫికెట్లను వాహనదారులు కచ్చితంగా తనలో ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, బీమా లేకుండా, అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవర్‌తో పాటు వాహన యజమానికీ పదేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే తల్లితండ్రులకు శిక్ష పడుతుందని చెప్పారు. వాహనాల్లో కెపాసిటికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంవీఐ వాసు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార రంగం బలోపేతం, రైతుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆమనగల్లు ప్యాక్స్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఉపాధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సహకార రంగ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులందరికీ సొసైటీల ద్వారా రుణాలిచ్చి సాగురంగం అభివృద్ధికి కృషి చేయాలని పాలకవర్గాలను కోరారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ప్యాక్స్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, డీసీసీబీ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై విశారదన్ పాదయాత్ర

వికారాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గడ్డపై బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి విశారదన్ మహరాజ్ రాష్ట్రంలో 15వేల కిలోమీటర్ల 'మా భూమి' పాదయాత్ర చేపడుతున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రతీ మనిషికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి కల్పించాలని పోరాటానికి డీఎస్పీ సిద్ధమవుతోందన్నారు. విశారదన్ పాదయాత్రకు ప్రజలంతా బ్రహ్మరథం పట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్, పార్టీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాయల్టీలుంటేనే ఖనిజాన్ని తరలించాలి

తాండూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయల్టీ ఉంటేనే నాపరాతి గనుల నుంచి బండరాళ్లను తరలించాలని తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ తెలిపారు. శనివారం గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద ఏడీ నాపరాతి లోడ్ లారీల పర్మిట్లను పరిశీలించారు. ఓగిపూర్, కరన్‌కోట్, మల్కాపూర్, సంగెంకలాన్, సిరిగిరిపేట్, కోట బాస్పల్లి గ్రామాల్లోని గనుల నుంచి నిత్యం నాపరాతిని తరలిస్తున్నారన్నారు. గనుల యజమానులు మైన్స్ శాఖ అనుమతుల మేరకే గనుల నుంచి ముడి సరుకులను తరలించాలన్నారు. కొందరు రాయల్టీ కట్టకుండానే లారీల్లో బండలను తరలిస్తున్నారని, అనుమతి లేని లారీలు పట్టుబడితే భారీ జరిమానా విధిస్తామన్నారు.

ఘనంగా హనుమంతుడి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పరిధి చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ పూజారులు రఘుపతిరావు, రామవేంద్రచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం హనుమంతుడి ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ పల్లకీసేవను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు పి.శ్రీశైలంగౌడ్, జి.వసంతరావు, ఎల్.రఘుగౌడ్, రఘునందన్‌రెడ్డి, జి.రమేష్, జి.శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, బచ్చన్న, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల లగేజీ మిస్!

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తమ లగేజీ మిస్సైందని 15మందిప్రయాణికులు శనివారం ఆందోళన చేశారు. నగరానికి చెందిన కొందరు అమెరికాలోని డల్లాస్ నుంచి ఖతర్ ఎయిర్‌లైన్స్‌లో దోహ వెళ్లారు. అక్కడి నుంచి ఇండిగో ఎయిర్ లైన్స్‌లో శంషాబాద్ చేరుకున్నారు. లగేజీని 11వ నంబరు బెల్టుపై వేయగా గంట వేచి ఉన్నా బ్యాగ్‌లు రాలేదు. ఎయిర్‌లైన్స్ సిబ్బందిని అడుగగా 9వ నంబరు బెల్టు వద్దకు వెళ్లాలన్నారు. అక్కడా బ్యాగులు కన్పించలేదు. దీంతో ప్రయాణికులు బ్యాగుల కోసం ఆందోళన చేశారు. డల్లాస్ నుంచి దోహ వెళ్లేందుకు 14గంటల 25నిమిషాలు పట్టగా, దోహ నుంచి హైదరాబాద్‌కు 4గంటల 20నిమిషాలు సమయం పట్టిందని, 19గంటలు ప్రయాణికులకు విమాన సిబ్బంది చుక్కలు చూపించారన్నారు. ఇప్పటికీ బ్యాగ్‌లు లభించలేదని, 24గంటల్లో వెతికిస్తామంటూ నిర్లక్ష్యంగా చెబుతున్నారని ప్రయాణికులు వాపోయారు.

గొల్ల చెరువుకు మహర్దశ ఎప్పుడో?

మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకునేదెన్నడు?



తాండూరులోని గొల్ల చెరువు

- సుందరీకరణ పనుల కోసం ప్రజల ఎదురుచూపు
- పూర్తి చేయాలని సర్కారుకు వేడుకోలు

తాండూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు సమీపంలోని చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే మొదటి ప్రాజెక్టుగా తాండూరు గొల్లచెరువును ఎంపిక చేశారు. అయితే ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. గొల్ల చెరువు కంటే చిన్న చెరువులు అభివృద్ధి చేశారు గానీ పట్టణానికి చేరువలో ఉన్న ఈ చెరుకు మాత్రం మహర్దశ పట్టడంలేదు. 2016లో గొల్ల చెరువు అభివృద్ధికి చర్యలు మొదలుపెట్టి అర్ధంతరంగా వదిలేశారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ పభుత్వం నిర్ణయించినా తాండూరులో ఒక్క చెరువూ అభివృద్ధికి నోచుకోలేదు. గొల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఆధునికీకరిస్తామని బీఆర్ఎస్ పాలనలో మంత్రులు హరీ‌ష్‌రావు, మహేందర్‌రెడ్డి ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో రూ.3.5కోట్లు మంజూరు చేయగా ఆ నిధులతో బతుకమ్మ ఘాట్, తూము, కట్ట మరమ్మతులు చేసి వదిలేశారు.

పట్టణ నడిబొడ్డున 40 ఎకరాల విస్తీర్ణంలో..



పిల్ల తొవ్వను తలపిస్తున్న చెరువు కట్ట

వందేళ్ల చరిత్ర ఉండి తాండూరు నడిబొడ్డులో 40ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గొల్ల చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగంగా, పర్యాటక కేంద్రంగా, స్థానికులకు ఆహ్లాదాన్న పంచేది. అందుకు అనుగుణంగాను చెరువు నీటిని శుద్ధిచేయాలని సైతం గతప్రభుత్వం తలంచింది. బోటింగ్ ఏర్పాటుకు 14ఫీట్ల మేర నీరుండాలి. గొల్ల చెరువు నీటి లోతు 16ఫీట్ల వరకు ఉది. మున్సిపాలిటీ మన ఊరు-మన ప్రణాళిక కింద రూ.5కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపింది. నిధులేమీ రాలేదు. 40ఎకరాల్లో విస్తరించి ఉన్న గొల్ల చెరువు ఇప్పటికే 9ఎకరాల 30గుంటల్లో పేదులు ఇళ్లు నిర్మించుకున్నారు. పేదలకు వేరేచోట ఆవాసాలు కల్పించి చెరువు పరిరక్షణ మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ప్రభుత్వానికి పంపారు. 5మీటర్ల వెడల్పు, 10మీటర్ల ఎత్తులో కట్ట ఏర్పాటు, తూము మరమ్మతు తదితరాలపై ప్రణాళిక రూపొందించారు. చెరువులో చేరుతున్న మురుగుతో దుర్వాస వస్తోందని, మురుగు నీటిని వేరే మార్గానికి మళ్లించడమో లేదా నీరే రాకుండా చేయాలన్న దానిపై చర్చించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ చెరువును పర్యాటంగా అభివృద్ధి ప్రజలు, ఉద్యోగులు, వృద్ధులు, వాకింగ్ చేసేవారికి ఉపయోగకరంగా ఉంటుందని అందరూ సంతోషించారు. మిషన్ కాకతీయ కింద చెరువులో రూ.40లక్షలతో పూడిక తీశారు. అలుగు నిర్మించారు. కట్టపై బతుకమ్మ ఘాట్ నిర్మించారు. సీసీ రోడ్డు, బ్యారికేడ్లు, చిన్న పార్కు, రీక్రియేషన్ క్లబ్, లైటింగ్, బతుకమ్మ మెట్లు, వినాయక నిమజ్జన ప్లాట్‌ఫామ్‌లను కట్టాలని నిర్ణయించారు. అయితే తలపెట్టిన పనుల్లో చాలామట్టుకు చేయక చెరువు సుందరీకరణ మరుగున పడింది.

నీటి శుద్ధికి రూ.6కోట్లు మంజూరు

బోటింగ్‌కు గొల్ల చెరువు అనుకూలంగా ఉంది. ఈ చెరువులో భారీగా నీటి నిల్వ ఉంటోంది. చెరువు నీటిశుద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం రూ.5కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. దీంతో మురుగు నీటిని దారిమళ్లింపు, ఇతర పనులకు రూ.6కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల మంత్రులు కె.వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అయితే పనులింకా ప్రారంభమే కాలేదు. గతంలో ఆరుగురు చీఫ్ ఇంజినీర్లతో గొల్ల చెరువు నీటి శుద్ధికి కమిటీ వేయగా సదరు కమిటీ నివేదికిచ్చింది. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించి మినీ ట్యాంక్‌బండ్ కలను సాకారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నగరానికే తలమానికం

(5వ పేజీ తరువాయి)

నారేగూడ, పులుమామిడి, గొల్లగూడ, గంగ్యాడ, గుబ్బడి ఫత్తేపూర్, ముబారక్‌పూర్, రావులపల్లి, శంకర్‌పల్లి, బుల్కాపూర్, టంగటూరు, రామంతాపూర్, చిన్న శంకర్‌పల్లి, పొద్దటూరు, పిల్లిగుండ్ల శివార్ల మీదుగా ప్రయాణిస్తూ ఉస్మాన్‌సాగర్‌లో కలుస్తుంది. వికారాబాద్ జిల్లాలో మూసీ నది 26 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. ఈ నది ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేది. నగర ప్రజల తాగునీటి అవ సరాలు తీర్చేందుకు మూసీ నదిపై రెండు కృత్రిమ జలాశయాలు నిర్మించారు. మూసీ నది హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లోకి ప్రవహిస్తుంది.



కమండల జలంతో అనంత పద్మనాభస్వామి పాదాలను అభిషేకించిన స్థలంలో వెలసిన భవానీ పుష్కరిణి



గంగ్యాడ సమీపంలో మూసీ నది ప్రవాహం

చిత్తలూరు వద్ద దక్షిణ దిశగా మలుపు

నగరంలో మూసీ నదిపై ఏడు పురాతన వంతెనలు ఉన్నాయి. మూసీ నది దక్కన్ పీఠభూమిలో కృష్ణా నదికి ప్రధాన ఉప నదిగా ఉంది నగరం మధ్య నుంచి ప్రవహిస్తూ... చారిత్రక పాత నగరాన్ని కొత్త ప్రాంతం నుంచి వేరు చేస్తుంది. అనంతగిరి కొండల్లో 2,168 అడుగుల ఎత్తులో జన్మించిన మూసీ.. తూర్పు దిశగా ప్రవహించి హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల మీదుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రవేశిస్తుంది. ఆలేరు, పాలేరు ఉప నదులను కలుపుకొని చిత్తలూరు వద్ద దక్షిణ దిశగా మలుపు తిరుగుతుంది. మూసీలో ఆలేరు ఉప నది కలిసే సూర్యాపేట చోట 1963లో జలాశయం నిర్మించారు. పాలేరు కలిసే చోట వాడపల్లి వద్ద 200 అడుగుల ఎత్తుకు దిగి ప్రయాణిస్తోంది. అనంతగిరి నుంచి వాడపల్లి వరకు 240 కిలోమీటర్ల దూరం మూసీ ప్రయాణం కొనసాగుతోంది. మూసీ బేసిన్ వైశాల్యం 4,329 చదరపు మైళ్ల కాగా, కృష్ణా నది బేసిన్ వైశాల్యంలో ఇది కేవలం 4.35 శాతమే. 1908లో కురిసిన భారీ వర్షాలతో మూసీ నదికి భారీ వరదలు వచ్చి 15 వేల మందికి పైగానే ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరువాతనే మూసీ నదికి వరదలు వచ్చినా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేలా చర్యలు చేపట్టారు.

పురాణ ప్రాశస్త్యం ఇలా..

అనంతగిరి కొండల్లో అనంతపద్మనాభస్వామి కొలువదీరిన చోటనే మూసీ నది జన్మించింది. ఈ నదికి పురాణ ప్రశస్త్యం కూడా ఉంది. పురాణాల ప్రకారం.. అనంతగిరి కొండల్లో మార్కండేయ మహర్షి తపస్సు చేస్తున్న సమయంలో ప్రతీ రోజూ తన యోగ సాధనతో అనంతగిరి నుంచి కాశీ వెళ్లి అక్కడ గంగా నదిలో స్నానమాచరించేవారు. రాజర్షి ముచుకుందుడు అనేక సంవత్సరాల పాటు రాక్షసులతో యుద్ధం చేసి అలసిపోయి అనంతగిరి అడవులకు వచ్చి శ్రీమన్నారాయణుడిని స్మరిస్తూ తపస్సు చేస్తారు. అయితే తనకు ఎవరు నిద్రాభంగం కలిగిస్తారో వారు అగ్నికి ఆహుతి అవుతారనే వరాన్ని దేవేంద్రుడు ముచుకుందుడికి ప్రసాదిస్తాడు. అనంతగిరిలో తపోనిష్టలో ఉన్న సమయంలో కాల యవనుడు అనే రాక్షసుడు అనంతగిరికి వచ్చి ముచుకుందుడికి తపోభంగం చేసి అగ్నికి ఆహుతవుతాడు. శ్రీమన్నారాయణుడు ముచుకుందుడికి దర్శనమివ్వగా, ఆయన తన కమండలంలోని జలంతో స్వామి వారి పాదాలను అభిషేకిస్తాడు. సంతోషించిన స్వామి అభిషేకించిన స్థలంలో జీవ నది ఉద్భవించి ముచుకుంద పేరుతో శాశ్వతంగా నిలిచిపోతుందని అనుగ్రహించినట్లు చరిత్ర చెబుతోంది. స్వామి వారి పాదాలను అభిషేకించిన స్థలంలోనే భవనాశిని పుష్కరిణి ఉంది. ఆ పుష్కరిణి నుంచి సన్నటి ధారగా ముచుకుందా నది ప్రయాణం ప్రారంభమై వికారాబాద్ పట్టణం మీదుగా రాజధాని వైపు ముందుకు సాగుతోంది.



గాంధీ విగ్రహంపై చెట్లకొమ్మల తొలగింపు

యాచారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యాచారంలో గురువారం కరెంటు వైర్లకింద చెట్ల నరికివేతలో భాగంగా గాంధీ విగ్రహం పక్కనున్న చెట్లనూ నరికారు. దాంతో చెట్లకొమ్మలు విగ్రహంపై పడ్డాయి. అయితే కొమ్మలు నరికిన వారు విగ్రహంపై నుంచి వాటిని తొలగించలేదు. ఈ నిర్లక్ష్యం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నాటడం.. నరకడం ఎందుకు?' శీర్షికన వచ్చిన వార్తకు మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు స్పందించారు. డాక్టర్ రవీందర్, సురేందర్, సంతోష్ తదితరులు గాంధీ విగ్రహంపైనుంచి కొమ్మలు తొలగించి విగ్రహాన్ని కడిగి పూలమాల వేశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఇలా కొమ్మలు నరికి విగ్రహంపై పడేయడం సరికాదన్నారు. ఈ విషయంపై వార్త ప్రచురించిన ఆంధ్రజ్యోతికి ఆర్యవైశ్య సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

హయత్‌నగర్ కోర్టులో వసతులు కల్పిస్తాం

● జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కోర్టులో మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తానని రంగారెడ్డి జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి అన్నారు. కోర్టు ప్రాంగణంలో నిర్మించనున్న బార్ అసోసియేషన్ భవనానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీజే మాట్లాడుతూ.. హయత్‌నగర్ కోర్టులో న్యాయవాదులకు అవసరమున్న వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతిగౌడ్ డీజేను సన్మానించి మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టుకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఏడో మెట్రోపాలిటన్ కోర్టు సూపరిండెంట్ శారద, నాజర్ లక్ష్మీనరసింహరెడ్డి, అడ్వకేట్ సొసైటీ కార్యదర్శి శ్రీధర్, గిరి, అనిల్‌కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్‌రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సీఐలు నాగరాజుగౌడ్, అంజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా సర్వే చేయాలి

శామీర్‌పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):కుటుంబ వివరాల నమోదులో ఎన్యూమరేటర్లు తప్పుల్లేకుండా లేకుండా జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శనివారం శామీర్‌పేటలో ఎన్యూమరేటర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. నమోదు చేస్తున్న రికార్డులను చూశారు. కుటుంబాల వివరాల నమోదులో సరైన పార్మాట్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేసి పామ్స్‌ను భద్రపర్చాలని అధికారులను, ఎన్యూమరేటర్లను ఆదేశించారు.

వివక్ష పారదోలేందుకు క్రీడలు దోహదం

వికారాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు జిల్లా స్థాయిలో ఆటలపోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆటల పోటీలను బ్లాక్ గ్రౌండ్‌లో ఆమె ప్రారంభించారు. దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తూ ఆత్మగౌరవాన్ని పెంచుతామన్నారు. సమాజంలో దివ్యాంగులపై వివక్షను పారదోలేందుకు ఆటల పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో బాలరక్ష భవన్ సమన్వయకర్త కాంతారావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రజిత, సీనియర్ అసిస్టెంట్లు జహీరుద్దీన్, రాములు, సంఘమేశ్వర్, ఎఫ్ఆర్‌వో వెంకటేశ్, ఫిజికల్ డైరెక్టర్లు ఆశాలత, సురేష్, శ్రీనివాస్, నరేష్, భవన్ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వెల్ఫేర్ అధికారి కృష్ణవేణి

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



ఇబ్రహీంపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి వివిధ గ్రామాల్లో కార్తీకమాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వీహెచ్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో దండుమైలారం శివాలయంలో శనివారం కార్తీకపౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. డీసీపీ సునీతారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీపీ కె.వీ.రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగరాజు, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లీశ్వరి జంగయ్య, వెంకట్‌రావు, ఐలేష్, అయ్యపురెడ్డి, డి.గణేష్, హరినారాయణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర



కొనుగోలు కేంద్రంలో తనిఖీ చేస్తున్న విజయేందర్‌రెడ్డి, సుగుణాబాయి

శామీర్‌పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే గిట్టుబాటు ధర వస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేటలో కొనుగోలు కేంద్రాన్ని శనివారం విజయేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుగుణాబాయి తనిఖీ చేశారు. సన్న, దొడ్డు రకాల వడ్లు వేర్వేరుగా కాంట వేసి నిల్వ చేయాలన్నారు. సన్నొడ్ల గన్నీ బ్యాగ్‌లపై 'ఎస్' అనే అక్షరం, జిల్లా, సెంటర్, కోడ్ రాయాలని సూచించారు. అలాగే రెండు రకాల వడ్లను వేర్వేరు లారీల్లో మిల్లులకు తరలించాలని కేంద్రం ఇన్‌చార్జిని ఆదేశించారు. ఏ విషయంలోనూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అభినందనీయం



విజేత టీంకు బహుమతి అందజేస్తున్న సీఐ నరేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. పెద్ద తూప్రలో శనివారం జరిగిన ఈషా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి సీఐ నరేందర్‌రెడ్డి హాజరై విజేత జట్టుకు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అలాగే క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడలతో స్నేహబంధాలు ఏర్పడుతాయని, మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఈషా ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు. టోర్నీలో రంగాపూర్, మదన్‌పల్లి, రాచలూర్, తూప్ర, ఐనాపూర్, దయాలగూడ, అమీర్‌పేట్, పెద్దతూప్ర దేవుని పడకల్ టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఐనాపూర్, మహదేవపురం తలపడగా ఐనాపూర్ విజేతగా, మహదేవపురం రన్నర్స్‌గా నిలిచాయి. విజేతకు రూ.9వేలు, షీల్డ్, రన్నర్స్‌కు రూ.5వేలు, షీల్డ్ అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే గ్రామోత్సవ పోటీలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెలలో హైదరాబాద్‌లో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. టోర్నీలో పాల్గొన్న వారందరికీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



షీల్డు అందుకుంటున్న పోటీల్లో గెలిచిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు

68వ ఎస్జీఎఫ్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు విజయం

తాండూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):ఈ నెల 15, 16 తేదీల్లో తాండూరులో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు విజయం సాధించింది. ఉమ్మడి పది జిల్లాల నుంచి 120మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. శనివారం ఫైనల్స్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ఆదిలాబాద్ టీంపై గెలిచింది. యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి, గౌతమి రెసిడెన్షియల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డిలు విజేతలకు కప్పు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య, గౌతమి స్కూల్ ప్రిన్సిపాల్ కొండారెడ్డి, జిల్లా పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

అక్రమంగా కలప దందా


లారీలో లోడ్ చేస్తున్న కలప

మర్పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వృక్షాలను నేలమట్టం చేస్తూ యథేచ్ఛగా అక్రమంగా కలపను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో నుంచి నిత్యం పదుల సంఖ్యలో అక్రమార్కులు కలపను యథేచ్ఛగా తరలిస్తున్నారు. చెట్టును నరకాలంటే ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ఇవేమి పట్టనట్లు అటవీ శాఖ అధికారుల అండదండలతో ప్రభుత్వానికి రుసుము చెల్లించకుండా నిత్యం వందలాది చెట్లను నరికేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు ప్రభుత్వం చెట్లను నరకరాదని, నరికిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేస్తున్నా అక్రమార్కులు మాత్రం యథేచ్ఛగా కలప దందాను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కలప వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నర్సింగ్ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు


కళాశాలలో గదులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కొడంగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు కావడంతో కళాశాల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశానుసారం శనివారం మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న గదుల్లో మరమ్మతు పనులతో తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

ఐటీ పార్కు ఏర్పాటయ్యేనా?

- భూ సేకరణకు 11ఏళ్లు కాలయాపన
- రైతులకు పరిహారం చెల్లించి రెండేళ్లు
- అభివృద్ధికి నోచని మాదారం ఐటీ పార్కు


మాదారం ఐటీ పార్కుకు ప్రభుత్వం సేకరించిన భూమి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా మారింది మాదారం ఐటీ పార్కు పరిస్థితి. ఈ ప్రాంతంలోకి పరిశ్రమలు వస్తే తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు వస్తాయన్న ఆశతో అక్కడి రైతులు తమ భూములను ప్రభుత్వానికి కట్టబెట్టారు. అధికారుల తాత్సారం వల్ల 2011 నుంచి చేపట్టిన భూసేకరణ సుదీర్ఘకాలం కొనసాగి 2022లో పూర్తయ్యింది. రైతులకు అదే ఏడాది జూలైలో పరిహారం అందజేశారు. కానీ ఇంత వరకు మాదారం ఐటీ పార్కు మాత్రం ఏర్పాటు కాలేదు.

ఏళ్ల తరబడి కాలయాపన

మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, మాదారం సర్వేనెంబర్ 225లో మొత్తం 319ఎకరాల అసైన్డ్‌భూమి ఉంది. అందులో నుంచి 219 ఎకరాల భూమిని 1978లో 89మంది రైతులకు ప్రభుత్వం అసైన్డ్‌పట్టాలు ఇచ్చింది. మిగతా భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది. కొంతమంది అసైన్డ్‌పట్టాదారులు భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగించారు. తిరిగి ఈ భూమిని స్వాధీనం చేసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. 2011లో సర్వేలు ప్రారంభించింది. అనేకసార్లు అధికారులు అసైన్డ్ రైతులతో గ్రామసభలు ఏర్పాటుచేశారు. సర్వేల పేరుతో అధికారులు దాదాపు 11ఏళ్ల కాలయాపన చేసి, సర్వే ప్రక్రియ పూర్తిచేసిన అధికారులు జూలై 2022లో ఎకరాకు రూ.32లక్షల పరిహారం చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. కానీ 14అసైన్డ్‌పట్టాదారుల వద్ద రికార్డులు సక్రమంగా లేకపోవడంతో 54ఎకరాల భూమికి పరిహారం చెల్లించలేదు. సేకరించిన భూమిని ప్రభుత్వం ఐటీపార్కు కోసం టీఎస్‌ఐఐసీ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ)కు కట్టబెట్టింది. సర్వేల పేరుతో ఏళ్ల తరబడి కాలయాపన చేసిన అధికారులు పరిహారం చెల్లించి రెండేళ్లు దాటిన మాదారం ఐటీ పార్కులో ఎలాంటి అభివృద్ధి కనిపించడంలేదని స్థానికులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో పరిశ్రమలు వస్తే తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో భూమిని అప్పగిస్తే అధికారులు తాత్సారం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరిగే విధంగా పరిశ్రమలు ఉండాలని, కాలుష్యరహిత పరిశ్రమలు రావాలని మాదారం పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. త్వరగా పరిశ్రమలను స్థాపించే విధంగా ప్రభుత్వ కృషిచేయాలని కోరుతున్నారు.

ఐటీపార్కు ఏర్పడితేనే అభివృద్ధి



మాదారంలో ఐటీ పార్కు ఏర్పడితేనే చుట్టుపక్కల గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయి. మంచి పరిశ్రమలు వస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. స్థానికులకు ఉపాధి లభిస్తుంది. అధికారులు ఇప్పటికైనా చొరవ చూపి మాదారం ఐటీపార్కు వచ్చేలా చూడాలి.

- జవ్వాజీ లింగం, ఎదులాబాద్

ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు



మాదారంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అధికారులు సర్వే నిర్వహించి, సేకరించిన భూమికి పరిహారం చెల్లించి రెండేళ్లు గడుస్తోంది. ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు తాత్సారం చేయకుండా పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేయాలి.

- నల్లోల యాదగిరి, మాజీ సర్పంచ్, మాదారం

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవాబుపేట/పూడూరు నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి మృతదేహం 22రోజుల తర్వాత లభ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన రాణా ప్రతాప్(28) అక్టోబరు 25వ తేదీన పూడూరు మండల పరిధిలోని చీలాపూర్‌లోని పెద్దగొల్ల శ్రీకాంత్ కూతురి శుభకార్యానికి వచ్చాడు. అదేరోజు రాత్రి బయటికి వెళ్లివస్తానని రాణా ప్రతాప్ కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల, తెలిసిన వారిని ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉండగా, శనివారం పూడూరు మండలంలోని కండ్లపల్లి గేటు వద్ద ఓ గుర్తుతెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూడగా, కాలిపోయిన స్థితిలో ఉన్న యువకుడి మృత దేహం, పక్కనే బైకును చూసి రాణాప్రతాప్ మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తండ్రి పెద్ద గొల్ల శేఖర్ రోదనలు మిన్నంటాయి. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో మృతదేహం లభ్యం కావడంతో ఆచూకీ కనుగొనడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు వెలువడుతున్నాయి.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట్ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్కూటీతో సహా చెరువులోకి దూసుకెళ్లిన ఓ వ్యక్తి మూడు నాలుగు రోజుల కిందట మృతి చెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. చెరువులో మృతదేహం నీటిపై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే శివారెడ్డిపేట్ చెరువు రోడ్డుపక్కన ప్రమాదకరంగా మారగా అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలోనూ ఓ కారుతో చెరువులోకి దూసుకెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువక ముందే ఈ సంఘటన చోటుచేసుకుంది. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.చెరువుకు చుట్టూ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రహదారి అంచు వద్ద రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

బంట్వారం(కోట్‌పల్లి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లిలో పేకాడుతుండగా తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ స్రవంతి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కోట్‌పల్లి మండలకేంద్రంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కుమ్మరి లాలప్ప షాప్ ముందు రోడ్డుపక్కన కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ పేకాడుతున్న గద్దకింది ఎల్లయ్య, పల్ల ప్రవీణ్‌కుమార్, తుమ్మలి భాస్కర్, సలీంకురేషి, ఎండీ గౌస్, ఫక్రుద్దీన్, నేర్లపల్లి రాంచెంద్రి, బలిజగూడం శ్రీశైలంలను అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్రవంతి తెలిపారు. పేకాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా పేకాడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు.

సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పాలుపంచుకోనున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

వికారాబాద్: జిల్లాలో గ్రూప్- 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్లి కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుతూ ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు సమయానుసారంగా బస్సులు నడిపించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో వాసుచంద్ర, అబ్సర్వర్ డాక్టర్ శ్రీధర్, రీజియన్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

115 పరీక్షా కేంద్రాలు.. 65,361 మంది అభ్యర్థులు

మేడ్చల్ ప్రతినిధి/ఘట్‌కేసర్ రూరల్ : టీజీపీఎస్‌సీ గ్రూప్ - 3 పరీక్షలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లాలో 115 కేంద్రాలు ఏర్పాటు చేశామని 65,361 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలకు మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, అన్ని సెషన్‌ల ప్రశ్నాపత్రాలను భద్రపరుచుకోవాలన్నారు. చీఫ్ సూపరింటెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్‌లను నియమించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

14 కేంద్రాల్లో 9, 291 మంది అభ్యర్థులు

గ్రూప్-3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఘట్‌కేసర్ తహసీల్దారు డీఎస్ రజిని తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 పరీక్ష కేంద్రాల్లో 9,291 మంది అభ్యర్థులు గ్రూప్- 3 పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆదివారం రెండు పేపర్లు, సోమవారం ఒక పేపర్ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో పరీక్ష సాగేల కృషిచేయాలని ఆమె కోరారు.

కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


తాండూరు రూరల్: మల్కాపూర్‌లో కులగణన సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

బొంరాస్‌పేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ఎన్యూమరేటర్‌లు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో వెంకన్నగౌడ్ సూచించారు. మండలంలో శనివారం ఆయన సర్వేను పరిశీలించారు. సర్వేలో కుటుంబాల వివరాలు తప్పులు లేకుండా సేకరించాలని తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు.

దౌల్తాబాద్: మండలంలోని నీటూర్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ సర్వేను పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేకు ప్రతీఒక్కరూ సహకరించి ఎన్యూమరేటర్లు కోరిన పూర్తి వివరాలు అందించాలని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బబ్యానాయక్ కోరారు. మండలంలోని మల్కాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో మాజీ సర్పంచ్ విజయలక్ష్మితో కలిసి ఇంటింటికి తిరిగి శనివారం సర్వే నిర్వహించారు. మండలంలో 33గ్రామ పంచాయతీల్లో 112 మంది ఎన్యూమరేటర్లు, 11మంది సూపర్‌వైజర్లు సర్వే నిర్వహిస్తున్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం

కొడంగల్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని కురుమ సంఘం జిల్లా నాయకులు నాగప్ప, మల్లప్ప, భాస్కర్, గోపాల్, ఆశప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత 50 సంవత్సరాలుగా బీసీల జనాభా లెక్కలు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక నష్టపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయమన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి


మూడుచింతలపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని లక్ష్మాపూర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి శోభారాణి అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం ఇంటింటా సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులకు ప్రజలు తమ వివరాలను తెలిపి భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రూ.10లక్షలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య ఖర్చులకు వెంటనే రూ.10లక్షలు విడుదల చేయాలని ఆ యూనియన్ కార్యదర్శి ఆళ్వాందార్ వేణుమాదవ్ డిమాండ్ చేశారు. కొర్రెముల, సుప్రభాత్‌టౌన్‌షిప్‌లో శనివారం సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించాలని తీర్మానించారు. డిసెంబరు 23వ తేదీన జరిగే సింగరేణి దినోత్సవం వరకు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు విజయబాబు, బంగారి రాజయ్య, బీరయ్య, పార్థసారథి, వెంకటరాజిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


మహాధర్నాకు బయల్దేరుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు


కొడంగల్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కొడంగల్ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, రామకృష్ణ, వెంకటయ్య అన్నారు. తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదారాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన మహాధర్నాలో పాల్గొనేందుకు కొడంగల్ నుంచి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా సునీత, సరళ, శ్రీనివాస్, దస్తప్ప, శంకరయ్య, వెంకట్‌రావు, చంద్రకళ, నాగరాజు, వేణు, తిరుమలేష్ తదితరులు ఇందిరాపార్క్‌కు తరలివెళ్లారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నిరుపేద యువకుడు


నవీన్‌కుమార్


యాలాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించాడు. మండలంలోని ఎన్కెపల్లికి చెందిన రైతు మాణి కొండ్డి, విజయలక్ష్మి దంపతులది నిరుపేద కుటుంబం. వీరి కుమారుడు నవీన్‌కుమార్ ఇటీవల నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష రాశాడు. ఈ పరీక్ష మొదటి ప్రయత్నంలోనే నవీన్‌కుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో వైద్య విధాన పరిషత్ వికారాబాద్ జిల్లాలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. నవీన్‌కుమార్ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు నవీన్‌ను అభినందించారు.

ఖైదీల ప్రవర్తనలో మార్పు మారాలి


పరిగి జైలులో మాట్లాడుతున్న వెంకటేశ్

పరిగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలని జిల్లా న్యాయసేవా సంస్థ కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్, శ్రీనివాస్‌లు సూచించారు. మండల న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం పరిగిలోని సబ్‌జైలును సందర్శించారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరాలు చేయడానికి భయపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎండీ గౌస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్ ప్రారంభం



లాజిస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముల్లి పావని

ఘట్‌కేసర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ ప్రజలు టీజీఆర్టీసీ ప్రవేశపెట్టిన పార్సిల్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ సెంటర్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, కౌన్సిలర్ ఆంజనేయులు గౌడ్, నాయకులు పల్లె విజయ్ గౌడ్, నిర్వాహకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

లగచర్లలో పోలీసుల ఆంక్షలు ఎత్తివేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో పోలీసుల ఆంక్షలు ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దుద్యాల మండలం లగచర్ల ఘటనపై సీపీఎం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తే పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే లగచర్ల ఘటన జరిగిందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను ప్రభుత్వం తీసుకోవడం సరైంది కాదన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఉన్న 1154 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అనంతయ్య, కిష్టప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులపై దాడి సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు లగచర్లలో ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం సరికాదని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. ఆయన మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులపై దాడులు చేసి ప్రజలను గందరగోళానికి గురిచేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.ఇలాంటి దాడులు పునరావృతం అయితే సహించేదిలేదన్నారు. దాడులకు పాల్పడిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టినట్లుగా పోడు భూములకు, వందల ఎకరాలున్న భూస్వాములకు రైతుబంధు పేరుతో కాంగ్రెస్ డబ్బును దోచిపెట్టలేదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి కాంగ్రెస్ పెద్దపీట


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసిందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 15 మంది లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా ఈ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా ధరణిని తొలగించి భూమాతను తీసుకొస్తోందన్నారు. రైతులకు ధాన్యాల కోసం మండలంలో ఒక గోడౌన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.


మేడ్చల్ టౌన్: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కౌన్సిలర్లు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు శనివారం స్థానిక కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్, బేరి బాల్‌రాజ్‌లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వి.శ్రీనివాస్‌రెడ్డికి రూ.42వేలు, లక్ష్మికి రూ.45వేల చెక్కులతో పాటు మరికొందరు బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పరిగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు దోహదపడతాయని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. పరిగిలోని నవభారతి విద్యానికేతన్ సైన్స్‌ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముజీబ్‌ఉర్ రహమాన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నవాబుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గేటు వనంపల్లిలో శనివారం కె.రోహన్ జేమ్స్ మైనింగ్ ఆధ్వర్యంలో మెడిక్యూర్ ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రత్నం పాల్గొని మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

కొడంగల్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నుంచి ఎన్కేపల్లి వెళ్లె రోడ్డులో శ్రీశేష ఆంజనేయస్వామి ఆలయం వద్ద చేతిపంపును శనివారం మరమ్మతులు చేశారు. చేతిపంపు పనిచేయక కొద్ది రోజులుగా పొలాలకు వెళ్లే రైతులు, ఆలయానికి వెళ్లే భక్తులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కులకచర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్న అంతారం గ్రామానికి చెందిన ఎల్లయ్య శనివారం మృతిచెందగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. అనంతరం పుట్టపహాడ్‌లో మృతిచెందిన నర్సయ్యగౌడ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

దోమ: బాసుపల్లిలో హరిజన అడివమ్మ మృతి చెందగా విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తాను అందుబాటులో లేకున్నా పార్టీ నాయకులు అనంతయ్య ద్వారా రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అనంతయ్య, పద్మశ్రీనివాస్, వెంకటయ్య, రామకృష్ణ, అశోక్, నారాయణ, సూర్యనాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కనకం మొగులయ్య

కులకచర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవా లని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్. ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి చంద్రభూపాల్‌రావు పాల్గొన్నారు.

నేడు గోశాలలో దీపోత్సవం

తాండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న తాండూరు పట్టణంలోని గోశాల వద్ద సాయంత్రం 5గంటలకు గోపూజ, దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పి.బాల్‌రెడ్డి, కార్యదర్శి కొత్రిక కిరణ్ కుమార్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

శామీర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్ట్రీట్ కాజ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గుర్క కుమార్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ కాజ్ సంస్థ అధ్యక్షురాలు తనుష్క, సభ్యులు ప్రనీత్, కృష్ణ, మనస్విని, ప్రత్యూష, హారిక తదితరులు పాల్గొన్నారు.